క్లుప్తంగా

ఘనంగా గణపతి విగ్రహ ప్రతిష్ట


గణపతి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భక్తులు

ఎస్.రాయవరం : పి.ధర్మవరం సమీపంలో వరహానది గట్టున శ్రీ గణపతి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎస్.రాయవరం గ్రామానికి చెందిన భక్తులు ఈ విగ్రహం ఏర్పాటు చేసేందుకు ఆర్థిక సహాయం చేసి విగ్రహప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా విగ్రహ ప్రతిష్ట ప్రాంగణంలో శాంతి హోమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదా లు అందజేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చూచుకొండలో నేడు వైఎస్సార్ తీర్థం


చూచుకొండలో రాజన్న విగ్రహం

మునగపాక : చూచుకొండలో మంగళవారం వైఎస్సార్ తీర్థం ఘనంగా నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మహానేత రాజన్న విగ్రహానికి పార్టీ నేతలు ఉదయం నివాళుల ర్పించే కార్యక్రమం జరుగుతుందన్నారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ప్రజలు వైఎస్సార్ తీర్థ మహోత్సవానికి తరలిరావాలని కోరారు.

జల్‌జీవన్ ద్వారా తాగునీటి సమస్య పరిష్కారం


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాద్

మునగపాక : జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. మునగపాక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా పనుల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందుతుందన్నా రు. పథకం నిర్వహణలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ దుర్గాప్రసాద్, ఈవో ఆర్డీ వెంకటలక్ష్మి కార్యక్రమంలో పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్ ఎస్‌ఐగా సింహాచలం

యలమంచిలి : యలమంచిలి రూరల్ ఎస్ఐగా పైల సింహాచలం సోమవారం యలమంచిలి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి పట్టణ ఎస్ఐగా పనిచేస్తున్న ఆయన యలమంచిలి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు ఎస్ఐగా బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐకు సిబ్బంది అభినందనలు తెలిపారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు, జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణపై చర్యలు చేపడతానని ఎస్ఐ తెలిపారు. గ్రామాల్లో చోరీలను అరికట్టడానికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రమాదాలకు నిలయమైన ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక స్టాపర్లు ఏర్పాటు చేస్తామని, మండలంలో గంజాయి, అక్రమ మద్యం రవాణా నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

'ఆడుదాం ఆంధ్రా'లో పతకాల పంట

కోటవురట్ల : ఆడుదాం ఆంధ్రాలో క్రీడాకారులు నియోజకవర్గ స్థాయిలో సత్తా చాటి పతకాలు సాధించారు. పురుషుల విభాగంలో వాలీబాల్ ప్రథమ, కబడ్డీ ద్వితీయ, బ్యాడ్మింటన్ ద్వితీయ, క్రికెట్ తృతీయ, బాలికల విభాగంలో బ్యాడ్మింటన్ ప్రథమ స్థానంలో నిలిచారు. విజేతలను ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

జగన్ ప్రభుత్వానికి మహిళల అండ

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం జగన్
- చంద్రబాబు బూటకపు హామీలు నమ్మకండి
- యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు


వెదురువాడలో రైతు భరోసా కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



అచ్యుతాపురంలో వైఎస్సార్ ఆసరా చెక్కుని అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

అచ్యుతాపురం : మహిళలు జగన్ ప్రభుత్వానికి అండగా ఉన్నారని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. వైఎస్సార్ ఆసరా 4వ విడత సంబరాల్లో భాగంగా సోమవారం అచ్యుతాపురం పోలీస్ గ్రౌండ్‌లో డ్వాక్రా మహిళలకు చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్రా మహిళలకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీతో సున్నా వడ్డీ అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. మహిళల సహకారంతోనే గత ఎన్నికల్లో 175 సీట్లకు గానూ 151 సీట్లు వైఎస్సార్‌సీపీ గెలుచుకుందని తెలిపారు.కాగా డ్వాక్రా మహిళల్ని మోసం చేసేందుకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పసుపు, కుంకుమ పేరిట ఎన్నికల బురిడీ కొట్టించేందుకు ప్రయత్నించినా మహిళలు తిప్పిగొట్టారని గుర్తు చేశారు.అవసరమైతే ఎన్నికల్లో గెలిచేందుకు చంద్రబాబు ఇంటికి ఒక కేజీ బంగారం ఇస్తామని అబద్దపు హామీలు ఇవ్వగల దిట్ట అని అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని కోరారు. అనంతరం మండలంలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సెజ్ కాలనీలో 10 లక్షల రూపాయలతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్, సెజ్ ఎస్‌సీ కాలనీలో 5 లక్షల రూపాయలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను, రూ. 43.60 లక్షలతో నిర్మించిన సచివాలయం ప్రారంభోత్సవం చేశారు. రూ.20 లక్షలతో నిర్మించిన ఇండోర్ స్టేడియం, వెదురువాడలో రూ.17.67 లక్షలతో నిర్మించిన బల్క్‌మిల్క్ సెంటర్, రూ. 23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.16 లక్షలతో నిర్మించిన డిజిటల్ లైబ్రరీ, రూ. 20.80 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్, పూడిమడకలో రూ. 85 లక్షలతో నిర్మించిన సచివాలయం 1,2 భవనాలు, హరి పాలెం గ్రామం కైలాస భూమిలో నిర్మించిన సామాజిక భవనం ప్రారంభోత్సవాలు చేశారు.

ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేతో పాటు డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, కాండ్రేగుల విష్ణుమూర్తి, ఎంపీపీ కోన సంధ్య, పూడిమడక సర్పంచ్ చేపల సుహాసిని, ఎం.ఎస్.శరగడం ప్రసాద్, దేశంశెట్టి శంకర్‌రావు, కో ఆప్షన్ జెడ్పీటీసీ సర్మాల కుమార్, వడిశెల శ్రీనివాసరావు, కూండ్రపు విమల నాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పిన్నమరాజు వాసు, లాలం శ్రీను, మోటూరు సంజీవి, బలిరెడ్డి శ్రీను, చేకూరి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

విద్యారంగంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక ముద్ర


పాఠశాలలో విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లు అందజేస్తున్న దృశ్యం

యలమంచిలి : రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని పద్మనాభరాజుపేట వైఎస్సార్‌సీపీ నాయకుడు గొన్నాబత్తుల శివ, పేట బయ్యవరం సర్పంచ్ మొగలిపల్లి సత్య నారాయణ అన్నారు. సోమవారం పద్మనాభరాజుపేట, బయ్యవరం గ్రామాల పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులు 23 మందికి ప్రభుత్వం అందిస్తున్న బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లను వారు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాముఖ్యతనిస్తుందని తెలిపారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు జగనన్న గోరుముద్ద పథకం ద్వారా మధ్యాహ్న భోజనం మెనూలో కొత్త మార్పు లు తీసుకువచ్చి విద్యార్థులకు రుచికరమైన పోషకాహారాన్ని అందిస్తున్నారని, అలాగే ఐఎఫ్‌పీ బోర్డుల ద్వారా విద్యార్థులకు చక్కటి బోధన అందుతోందని తెలిపారు. ఎంపీటీసీ ఊటకూటి శేఖర్ మాట్లాడు తూ పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని, ప్రతి పేదవాడి బిడ్డకు ఆంగ్ల విద్యను అందించాలన్నదే జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం అని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యు.వరలక్ష్మి, బొడ్డేడ సత్యనారాయణ, కె.వీరభద్రరావు, పి.రవీంద్ర, బి.వి. ధనలక్ష్మి, ఎస్.శ్రీనుబాబు పాల్గొన్నారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

రాంబిల్లి: వాడనర్సాపురం గ్రామ పరిధిలో పేకాటశిబిరంపై దాడులు నిర్వహించి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామని సీఐ ఎస్. లక్ష్మణరావు తెలిపారు. ఈ గ్రామ పరిధిలో పేకాట ఆడుతున్నట్టు తమకు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. అలాగే రూ.1380 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

'ఆడుదాం-ఆంధ్రా' విజేతలకు బహుమతులు


క్రికెట్‌లో విజయం సాధించిన పురుషుల జట్టు


ఖోఖో లో విజయం సాధించిన మహిళల జట్టు

పాయకరావుపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆడుదాం – ఆంధ్రా క్రీడలు పోటీలు యువతీ, యువకుల్లో ఎంతో ఉత్సాహం కలిగిందని, ఉమ్మడి జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు అన్నారు. ఆడుదాం – ఆంధ్రా నియోజకవర్గ స్థాయిలో విజేతలైన క్రీడాకారులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందించే కార్యక్రమానికి చిక్కాల రామారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులకు గుర్తింపు తీసుకురావడం కోసం గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఆడుదాం – ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తున్నారని అన్నారు. నియోజకవర్గ స్థాయిలో వివిధ మండలాల్లో క్రికెట్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీల్లో విజేతలకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు, మెడల్స్‌ను అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పాయకరావుపేట, నక్కపల్లి, కోటవురట్ల ఎంపీడీవోలు ఎ.సాంబశివరావు, శ్రీనివాసరావు, కాశీ విశ్వనాథరావు, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కాధా రామకృష్ణ, పాల్మన్‌పేట సర్పంచ్ కోడ కోటేశ్వరరావు, ఎంఈవోలు కె.ఎస్. గాంధీ, నరేష్, నియోజకవర్గ క్రీడల నోడల్ అధికారి రవికుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఆత్మస్థయిర్యం నింపిన 'పరీక్షా పే చర్చా'

ప్రధాని కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించిన విద్యార్థులు


కొత్తపేట జెడ్పీ హైస్కూల్లో పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

యలమంచిలి రూరల్ : విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టి, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపడానికి సోమవారం ప్రధాని మోదీ నిర్వహించిన పరీక్షా పే చర్చ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని యలమంచిలి మండలం, పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్(ఐఎఫ్‌పి)లను ఏర్పాటు చేయడంతో ప్రధాని ప్రసంగాన్ని విద్యార్థులంతా ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించే అవకాశం ఏర్పడింది. ఢిల్లీ భారతీ మందిరంలో జరిగిన పరీక్ష పే చర్చ కార్యక్రమంలో ప్రధాని సూచించిన పలు చిట్కాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. పట్టణంలో కొత్తపేట, స్టేషన్ రోడ్డు జెడ్పీ హైస్కూళ్లు, జెడ్పీ బాలికోన్నత పాఠశాల సహా పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులంతా ప్రధాని ప్రసంగంలో అంశాలను చర్చించుకున్నారు. పరీక్షల ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో ప్రధాని వివరించిన తీరు విద్యార్థులను ఆకట్టుకుంది. ఆట స్థలానికి వెళ్లిన వారిలో కొందరే విజేతలుగా తిరిగి వస్తారు. ఎక్కువ మంది ఓటమి చెందుతారు. ప్రతి ఓటమి ఒక కొత్త పాఠాన్ని నేర్పుతుందని, ఇతరులపై కన్నా మీపైనే మీరు దృష్టి పెట్టడం, మీతో మీరే పోటీ పడడం వంటి ప్రధాని మాటలు విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. పలు చోట్ల ఉపాధ్యాయులు ప్రధాని మోదీ ప్రసంగాన్ని విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. స్మార్ట్ ఫోన్‌ను అవసరం మేరకే వినియోగించాలని ప్రధాని మోదీ చెప్పిన విషయాన్ని విద్యార్థులు పాటించాలని కొత్తపేట హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు సుసర్ల సూర్య ప్రకాష్ (జిల్లా రిసోర్స్ పర్సన్) వివరించారు.

మద్యం అక్రమ నిల్వ పట్టివేత


పట్టుబడిన మద్యం సీసాలతో ఎస్ఐ రమణయ్య

కోటవురట్ల : అక్రమంగా ఇంట్లో నిలువ చేసిన మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాల ప్రకారం రామన్నపాలెం గ్రామంలో పోలుపర్తి అప్పలనాయుడు ఇంటిపై దాడి చేయగా 11 మద్యం సీసాలు పట్టుబడినట్టు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

కాపు జేఏసీ కన్వీనర్‌గా నాగేశ్వరరావు



రాంబిల్లి: కాపు జేఏసీ యలమంచిలి నియోజకవర్గ కన్వీనర్‌గా గోకివాడకు చెందిన ద్వారపురెడ్డి నాగేశ్వరరావు నియమితులు కావడంతో ఆయనను పలువురు అభినందించారు. కాపుల ఐక్యతకు, సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నాగేశ్వరరావు పేర్కొన్నారు. కాపులు రాజకీయంగా , ఆర్థికంగా ఎదిగేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని ఆయన కోరారు.

తగ్గని చలి తీవ్రత

రాంబిల్లి : ఈ ఏడాది చలి తీవ్రత ఇంకా తగ్గడం లేదు. జనవరి నెల ముగుస్తున్నా ఇంకా చలి కొనసాగుతుంది. పల్లెల్లో గతంలో జనవరిలో ఇంత చలి ఎప్పుడూ లేదని ప్రజలు చెబుతున్నారు. వెచ్చదనం కోసం పల్లెల్లో మంటలు వేసుకుంటున్నారు. మరో పక్క మంచు కొనసాగుతుంది. ఉదయం 7 గంటల వరకు మంచు కురుస్తుంది. ఈ మంచు ప్రభావం పెసర, మినుము పంటలపై పడితే నష్టం కల్గే అవకాశాలున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.





ఎమ్మెల్యే రమణమూర్తిరాజు పర్యటన నేడు

మునగపాక : మండలంలో ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు పర్యటన మంగళవారం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు గంగాదేవిపేటలో అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. 10 గంటలకు మునగపాక రాహుల్‌గాంధీ కళ్యాణమండపంలో వైఎస్సార్ ఆసరా సదస్సు జరుగుతుందన్నారు. బీసీ కాలనీలో నూతనంగా నిర్మించిన డ్రైన్లు, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ నిధులతో నిర్మించిన డ్రైన్, రూ.3 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డుకు ప్రారంభోత్సవం చేస్తారని , మడకపాలెంలో రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తారని, పార్టీ శ్రేణులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని అచ్చియ్యనాయుడు కోరారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


మాడుగులలో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సిఐడీ సీఐ ప్రసాదురావు

మాడుగుల రూరల్ : షెడ్యూల్ కులాలు, షెడ్యూలు తెగలు సామాజిక వర్గాలు చట్టాలు వాటి వినియోగంపై సిఐడీ శాఖ అవగాహన కార్యక్రమం సోమవారం సాయంత్రం తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేశారు. విశాఖ సిఐడీ ప్రాంతీయ కార్యాలయం సీఐ బి.వి.జి. ప్రసాదురావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ కులాలు, తెగల సామాజిక వర్గాలు ప్రజలు అనుకున్నంత ప్రగతి సాధించలేకపోతున్నారని గుర్తించి ఏపీ సీఐడీ అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్.సంజయ్(ఐపీఎస్) ఆధ్వర్యంలో ఆయా సామాజిక వర్గాల వారికి ఉద్దేశించి చేసిన చట్టాల పట్ల, అభివృద్ధి పథకాల పట్ల అవగాహన కల్పించి వారిని చైతన్యవంతులు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ఈ అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 17లో కొన్ని అంశాలు పొందుపర్చడం జరిగిందని, ఈ ఆర్టికల్ 17 అనుసరించి ఎస్సీ, ఎస్టీల పురోభివృద్ధి, రక్షణ నిమిత్తం చట్టాలు రూపొందించారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.వి.రత్నం, ఇన్‌చార్జి ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, విశాఖ సిఐడీ రీజనల్ కార్యాలయం ఎస్ఐ ఆర్.కోటీశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు, ఎస్ఐ-2 నాగరాజు, సర్పంచ్ కళావతితో పాటు ఎస్సీ, ఎస్టీ సంఘ నాయకులు, సంబంధిత ఉద్యోగులు పాల్గొన్నారు.

'పరీక్షా పే చర్చా' కార్యక్రమంలో ఉప్పరాపల్లి హెచ్‌ఎం


పరీక్షా పే చర్చా కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పరాపల్లి పాఠశాల ఉపాధ్యాయుడు సంపత్‌రావు

ఎస్.రాయవరం : ప్రధాని నరేంద్రమోదీతో నిర్వహించిన పరీక్షా పే చర్చా కార్యక్రమంలో ఎస్.రాయవరం మండలం ఉప్పరాపల్లి ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు కె.సంపత్‌రావు మాట్లాడడం అభినందనీయమని మండల పీఆర్‌టీయు ఉపాధ్యాయ సంఘ నాయకులు అభినందించారు. దూరదర్శన్ చానల్ లైవ్ ప్రోగ్రాం ద్వారా నరేంద్రమోదీ నిర్వహించిన వేదిక పై రాష్ట్రం నుంచి సంపత్‌రావు కనెక్ట్ అయి ఒక సలహా ఇచ్చినట్టు పేర్కొన్నారు. పరీక్షల వల్ల విద్యార్థులు ఒత్తిడికి గురి కాకూడదన్న అంశంపై ఈ ఉపాధ్యాయుడు సంగీతం వినడం వల్ల కూడా ఒత్తిడి తగ్గుతుందన్న సలహా ఇచ్చారు. ఈ సలహాను పరీక్షా పే చర్చా నిర్వాహకులు స్వీకరించినట్టు చెప్పారు. ప్రధాని మోదీ కార్యక్రమంలో తమ ఉపాధ్యాయుడు మాట్లాడడం అభినందనీయమని పీఆర్‌టీయు మండల అధ్యక్ష కార్యదర్శులు భద్రరావు, శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సంఘ నాయకులు అభినందనలు తెలిపారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

యలమంచిలి : యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అధ్యక్షతన మంగళవారం ఉదయం 11 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో పట్టణంలో పలు వార్డులకు సంబంధించి అభివృద్ధి పనులపై కౌన్సిల్ సభ్యులు అందరితో చర్చించడం జరుగుతుందని మున్సిపల్ అధికారులు , ఉద్యోగులు, వార్డు కౌన్సిలర్లు సంబంధిత శాఖ అధికారులంతా హాజరు కావాలని కోరారు.



నేడు రక్తదాన శిబిరం

యలమంచిలి రూరల్ : మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు కొఠారు దుర్గారావు, ఆచళ్ల వీర, గొల్లవిల్లి చిన్నాజీ తెలిపారు. ఈ శిబిరాన్ని పూర్వ విద్యార్థులు, యువకులు విజయవంతం చేయాలని వారు కోరారు. మదర్ బ్లడ్ కేంద్రం ఆధ్వర్యంలో శిబిరం కొనసాగుతుందని చెప్పారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని అవకాశం ఉన్న యువకులంతా రక్తదానానికి ముందుకు రావాలని వారు కోరారు.

బొడ్డేడ జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు

మునగపాక : వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ జన్మదినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు మంగళవారం రక్తదానం శిబిరంతో పాటు మండల వ్యాప్తంగా ఆరువేల మందికి దుప్పట్లు పంపిణీ చేసేందుకు అవసరమయ్యే ఏర్పాట్లు చేశారు. మునగపాక నందీశ్వర కళాప్రాంగణంలో సాయంత్రం 6 గంటలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం ఉంటుంది.

